

నేడు పాఠశాలలకు సెలవు

శ్రీకాకుళం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వర్షాలు ఇంకా ఎక్కువ కురిస్తే.. కళాశాలలకు కూడా సెలవు ప్రకటించే నిర్ణయం సోమవారం వేకవజామున తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలకు మాత్రమే సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

- అల్పపీడనంతో జిల్లాలో భారీ వర్షాలు
- చెరువులను తలపించిన పంటపొలాలు
- మరో మూడు రోజులు వానలే
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలంటూ మంత్రి అచ్చెన్న ఆదేశం

ముంచెత్తిన వాన


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచిన వర్షపు నీరు

శ్రీకాకుళం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్లు, రహదారులపై వర్షపునీరు నిలిచిపోతోంది. రహదారులు ఛిద్రమవుతున్నాయి. పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కొన్నిచోట్ల చెరువులను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గత రెండు రోజులతో పోలిస్తే ఆదివారం వాన దంచికొట్టింది. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారు. పలాస నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ ప్రాంతంలో పంట పొలాలు చెరువులను తలపించాయి. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రెండు అడుగుల (మిగతా 8వ పేజీలో..)


జలమయమైన పొట్టిశ్రీరాముల జంక్షన్

ఆదివారం
వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ)
మందస	117.5
రణస్థలం	69.0
వజ్రపుకొత్తూరు	65.75
సోంపేట	58.5
ఎల్.ఎన్.పేట	47.5
లావేరు	42.25
బూర్జ	41.5
ఆమదాలవలస	41.25
శ్రీకాకుళం	41.25
పోలాకి	38.5
ఎచ్చెర్ల	38.0
ఇచ్ఛాపురం	36.75
నరసన్నపేట	34.75
సంతబొమ్మాళి	34.25
కవిటి	29.75
టెక్కలి	29.25
పాతపట్నం	25.0
పలాస	25.0
నందిగాం	24.75
కంచిలి	24.5
సారవకోట	23.75
మెళియాపుట్టి	22.75

జిల్లాకు భారీ వర్ష సూచన


- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే (మిగతా 8వ పేజీలో..)

పెరిగిన వంశ'ధార'..

హిరమండలం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వంశధార నదిలో నీటి ప్రవాహం పెరిగింది. మొన్నటి వరకూ ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుతూ వస్తుండడంతో గొట్టా బ్యారేజీ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువలకు పూర్తి స్థాయిలో సాగునీటిని విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదిలో వరద ప్రవహిస్తుంది. దీంతో గొట్టా బ్యారేజీకి 8,577 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఆదివారం సాయంత్రానికి బ్యారేజి దిగువకు 6,498 క్యూసెక్కుల నీటిని అధికారులు విడిచిపెడుతున్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1771 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 308 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నారు.


గొట్టాబ్యారేజీ దిగువకు వరద నీరు విడిచిపెట్టిన దృశ్యం


ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలు

సముద్రం అల్లకల్లోలం..

గారరూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బందరువానిపేట వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడతున్నాయి. వాతావరణ, మత్స్య శాఖ అధికారుల సూచనల మేరకు మండల వ్యాప్తంగా మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. బోట్లకు ఒడ్డున లంగరు వేశారు.


ఒడ్డున లంగర్ వేసిన బోట్లు

సముద్రంలోకి కొట్టుకుపోయిన తెప్పలు

హరిపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన ఎడతెరిపిలేని వర్షంతో గెడ్డలు, వాగులు, వంకలు ఏక మయ్యాయి. వరద ఉధృతి సముద్రంలోకి వచ్చి ంది. దీంతో సముద్రం ఒడ్డున భద్రపరిచిన తెప్పల్లో నాలుగు సముద్రంలోకి కొట్టుకుపోయాయి. వెంటనే మత్స్యకారులు స్పందించి సముద్రంలోకి వెళ్లి కొట్టుకుపోయిన తెప్పలను ఎంతో శ్రమకూర్చి ఒడ్డుకు చేర్చారు. ఎటువంటి ఆస్తి నష్టం జరగకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

నీటమునిగిన పంట పొలాలు..

భారీ వర్షాలకు సంకుజోడు, వీజీపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. సునాముది, మహేంద్రతనయా పొంగిపొర్లుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయి.


సముద్రంలోకి కొట్టుకుపోతున్న తెప్ప


అధ్వానంగా ఉన్న బాహుదా చానల్

నీరు ఒడిశాది.. నష్టం ఏపీది

- వరదల సమయంలోనే బాహుదాలో నీరు
- పంటలకు అవసరమైనప్పుడు కానరాదు
- నిర్లక్ష్యంలో 11 ఓపెన్ హెడ్ చానల్స్
- గత ఆరేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఆందోళనలో రైతాంగం

ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి)


ప్రస్తుతం జిల్లాలో అడపాదడపా వర్షాలు పడుతున్నా బాహుదా నదిలో మాత్రం నీటి ప్రవాహం లేదు. దీంతో ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గతంలో లక్షలాది మందికి దాహం తీర్చుతూ.. వేల ఎకరాలను సస్యశ్యామలం చేసేది బాహుదా నది. ఇప్పుడు మాత్రం కేవలం ఒడిశా ప్రయోజనాలకే అన్నట్టు మారిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే వర్షకాలం నదిగా మాత్రమే బహుదా ఈ ప్రాంతీయులకు కనిపిస్తోంది. నీరు ఒడిశాది..వరదల నష్టం మాత్రం ఏపీది అన్నట్టు ఉంది. భారీ వరదల సమయంలో నది గట్లకు గండ్లు పడి ఇచ్ఛాపురం, కవిటి మండలాల రైతులకు తీరని నష్టం కలుగుతోంది. కానీ వర్షాభావ పరిస్థితుల్లో మాత్రం నదిలో చుక్క నీరు కనిపించదు.

అంతా ఒడిశా ప్రయోజనానికే..

నదిలో సింహభాగం ప్రయోజనాలన్నీ ఒడిశాకే చెందుతున్నాయి. ఎందుకంటే ఎగువ ప్రాంతం కాబట్టి. ఒడిశాలో పుట్టి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది బాహుదా. ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇచ్ఛాపురం పట్టణంతో పాటు మరో 30 గ్రామాలకు సాగునీటి ప్రధాన ఆధారం కూడా బాహుదే. కానీ, నదికి సంబంధించి సరైన నిర్వహణ లేదు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, గత పాలకుల తప్పిదాలు, నదిలో నీటి ప్రవాహం మార్పులు తదితర కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్నింటికీ మించి ఒడిశా ఎగువ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన ప్రాజెక్టులు కింద ప్రాంతంగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారుతున్నాయి. లెక్కలేనన్ని ఎత్తిపోతల పథకాలు ఒడిశా ప్రాంతాల్లో నిర్మించారు. వాటన్నింటినీ దాటుకొని కింది ప్రాంతాలకు నీరు రావడం గగనంగా మారింది. మొన్న ఆ మధ్యన వేసవి ప్రారంభ సమయంలో ఇచ్ఛాపురం పట్టణానికి తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో నీరు విడిచిపెట్టాలని (మిగతా 8వ పేజీలో..)

అంతులేని నిర్లక్ష్యం..

బాహుదాను వినియోగించుకుంటే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సింహభాగం సస్యశ్యామలం అవుతుంది. కానీ, ఒడిశా మాదిరిగా కనీస ఆలోచన చేయడం లేదు ఏపీ పాలకులు. ఒడిశా భూభాగంలో ప్రాజెక్టుల మీద ప్రాజెక్టులు కడుతున్నారు. కానీ, మన భూభాగంలో 18 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 11 ఓపెన్ హెడ్ చానల్స్‌ను కనీసం మరమ్మతులు చేసుకునే స్థితిలో కూడా మనం లేము. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సాగునీటి వనరుల విషయంలో కదలిక వచ్చింది. వాటిని వీలైనంత త్వరగా బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే గతం మాదిరిగా పంట కాలువలు, గ్రోయిన్లు, రాతికట్టడాలకు రైతులే సొంతగా నిధులు వేసుకొని బాగుచేసుకోవాల్సి ఉంటుంది. బాహుదా ఆయకట్టు పరిధిలో 750 చెరువులు ఉన్నాయి. వాటికి నది నీటిని మళ్లించాలి. వరద పోటు తీరం, పంట పొలాలపై పడకుండా చిన్నపాటి కరకట్టలు నిర్మించాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు. ముందుగా నదిలో చెత్త, పూడిక తొలగించాలి. జలాల వినియోగం విషయంలో ఒడిశాతో చర్చించాలి. ఓపెన్ హెడ్స్ చానల్స్‌ను ఆధునీకరించాలి. అనుసంధానంగా చెరువులకు ఉండే కాలువలను సైతం మరింత మెరుగుపరచాలి.



త్వరలో కొత్త టీచర్లు

- నేడో.. రేపో డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల
- విద్యాశాఖ కసరత్తు
- అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు బృందాల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 543 పోస్టులు
- పరీక్షలు రాసింది 22,648 మంది
- టెట్ మార్కుల సవరణకు ముగిసిన గడువు

నరసన్నపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ద్వారా కొత్త ఉపాధ్యాయుల నియామకానికి విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 543 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇప్పటికే అభ్యర్థుల మార్కులను విద్యాశాఖ విడుదల చేసింది. తదుపరి మెరిట్ జాబితా, రిజర్వేషన్ కం రోస్టర్ మార్గదర్శకాల మేరకు సెలక్షన్ జాబితా, అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోస్టింగ్ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా వివరాలను పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో నోటీఫై చేసిన మొత్తం పోస్టుల సంఖ్య, మేనేజ్‌మెంట్, కేటగిరీ, మీడియం, సబ్జెక్టు వారీగా వివరాలు పంపాలని సూచించారు. ఈ నెల 31 నాటికి ఏర్పడే ఖాళీల సంఖ్యను కూడా ఇదే ఫార్మేట్‌లో అందజేయాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు కేటాయించేందుకు పాఠశాలల వారీగా ఖాళీల వివరాలు, అసలు టీచరే లేకుండా కేటగిరీ-3/4 ల్లో ఉన్న స్కూల్స్ వివరాలు, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నూతనస్థానాలకు బదిలీ అయినా రిలీవర్ లేక పాత స్కూలులోనే కొనసాగుతుంటే ఆ పాఠశాల వివరాలు, 50వాతం మందికి పైబడి టీచర్లు లేని పాఠశాలలు మొదలైన వివరాలను సేకరించడానికి జిల్లాస్థాయిలో ఈనెల 18న బృందాలను నియమించి, నిర్ణీత ఫార్మేట్‌లో క్షేత్ర స్థాయి నుంచి డేటాను తీసుకోవాలని ఆదేశించారు.

- ఉమ్మడి జిల్లాలో 543 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 20న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపాలిటీల్లో 458 పోస్టుల ఉన్నాయి. ఇందులో ఎస్జీటీ 113, ఫిజికల్ ఎడ్యుకేషన్ -81, సోషల్-70, బయాలజీ- 34, ఫిజికల్ సైన్సు -14 గణితం -33, ఇంగ్లీషు -65, హిందీ- 11, తెలుగు -37 పోస్టులు ఉన్నాయి. అలాగే, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమపాఠశాలల్లో 85 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ఇందులో ఎస్జీటీ -33, సోషల్ -5, బయాలజీ-12, ఫిజికల్ సైన్సు -10, గణితం -13, ఇంగ్లీషు -12 పోస్టులకు ఉన్నాయి. మొత్తం 543 పోస్టులకు 22,648 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పురుషులు 9,653 మంది, మహిళలు 12,995 మంది ఉన్నారు. పురుషులు కంటే 3,342 మంది మహిళా అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారు. రిజర్వేషన్ కేటగిరీల వారీగా పరిశీలిస్తే బీసీడీ నుంచి అత్యధికంగా 7,281 మంది దరఖాస్తు చేసుకోగా, బీసీసీ నుంచి కేవలం 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎటువంటి రిజర్వేషన్ లేనివారు 653 మంది, బీసీఏలో 5,210 మంది, బీసీబీ 2,737 మంది (మిగతా 7వ పేజీలో..)

తమ్ముడిని కాపాడి.. అనంతలోకాలకు

- నాగావళి నదిలో మునిగి విద్యార్థి మృతి
- ఊపిరి తీసిన ఊబి
- శుభ కార్యానికి వచ్చి విగతజీవిగా మారిన వైనం
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు


పవన్ (ఫైల్)

శ్రీకాకుళంరూరల్/పాలకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నాగావళి నదిలోని ఊబిలో కూరుపోయి ఓ విద్యార్థి మృతి చెందాడు. తన తమ్ముడిన కాపాడి.. చివరకు అనంత లోకాలకు వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పాలకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రూరల్ నవనంపాడు గ్రామానికి చెందిన ద్వారపూడి పవన్(16) విశాఖలోని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పవన్ తండ్రి రవి, తల్లి వసంత జీవనోపాధి కోసం విశాఖపట్నంలో ఉంటూ గ్రామానికి వస్తూ వెళ్తూ ఉండేవారు. తమ బంధువుల గృహ ప్రవేశం సందర్భంగా శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి పవన్ పాలకొండ మండలం అన్నవరం గ్రామం చేరుకున్నాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికని తన తమ్ముడు భార్గవ్, చిన్నాన్నతో కలిసి ఆ గ్రామంలోని నాగావళి నదికి వెళ్లాడు. తొలుత భార్గవ్‌నదిలో దిగేందుకు ప్రయత్నించి అక్కడున్న ఊబిలోకి కూరుకుపోయాడు. ఇది గమనించిన పవన్ భార్గవ్‌ను ఒడ్డుకు లాగి ప్రమాదవశాత్తూ నదిలోని అదే ఊబిలో కూరుకుపో యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన నది వద్దకు చేరుకుని పవన్‌ను రక్షించే ప్రయత్నం చేశారు. ఊబిలో నుంచి పవన్‌ను బయటకు తీశారు. అప్పటికే స్పృహ కోల్పోయి ఉండడంతో సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గ మధ్యంలోనే పవన్ మృత్యువాత పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు ద్వారపూడి రవి, వసంతలు బోరున విలపించారు. అంతవరకు తమతో ఉన్న కుమారుడు ఇలా ఆకస్మికంగా మృతి చెందడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. మరోవైపు గృహ ప్రవేశానికి వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. అందరితో సరదాగా గడిపిన పవన్ విగతజీవిగా మారడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాలకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలే కారణమా?

అన్నవరం గ్రామ (మిగతా 7వ పేజీలో..)

క్యాబ్, కారుని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- తప్పిన పెను ప్రమాదం
8



నాన్‌స్టాప్ నిల్.. పల్లెవెలుగు ఫుల్!
- స్త్రీశక్తి పథకం ఎఫెక్ట్
8



అమరావతి పార్క్‌పై నిర్లక్ష్యం
7

అమరావతి పార్క్‌పై నిర్లక్ష్యం

● ఆహ్లాదం కనుమరుగు
● పిచ్చిమొక్కలతో నిండి.. పాములకు నిలయంగా మారి..





నిరాదరణకు గురైన అమరావతి పార్క్ (ఇన్‌సెట్‌లో) పార్క్ లోపల దుస్థితి

ఆమదాలవలస, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు ఆహ్లాదం కలిగించేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన అమరావతి పార్కు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా తయారైంది. పట్టణ పరిధిలోని రైల్వే ట్రాక్‌కు ఆనుకుని సుమారు 15 ఏళ్ల కిందట ఏర్పాటైన బొడ్డేపల్లి రాజగోపాలరావు నగర్ ఏర్పాటైంది. ఈ కాలనీ సమీపంలో 2018లో అప్పటి ప్రభుత్వం అమరావతి పేరుతో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పార్కును ఏర్పాటు చేసింది. అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్, అప్పటి మునిసిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత దీనిని ప్రారంభించారు. విశాలమైన ప్రాంగణంలో మొక్కల పెంపకంతో పాటు పార్కుకు వచ్చే ప్రజలు కూర్చొనేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఆ తరువాత బీఆర్ నగర్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు నిత్యం పార్కుకు వచ్చి సేదతీరి ఆనందం పొందేవారు. అయితే ఆ తరువాత రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు ఇక్కడ మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కు నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో పార్కులో పిచ్చి మొక్కలు పెరిగి, పాములు సంచరిస్తుండడంతో ప్రజలు రావడం మానేశారు. ప్రస్తుతం ఎటువంటి ఉపయోగం లేక లక్షల రూపాయల ప్రజాధనం వృథా అయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కనీస సదుపాయాలు లేని బీఆర్ నగర్

బీఆర్ నగర్ ఏర్పాటై 15 ఏళ్లు కావస్తున్నా నేటికీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం అన్ని పార్టీలు కాలనీ అభివృద్ధిపై హామీలిచ్చి ఆ తరువాత మరిచిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అమరావతి పార్కును పునరుద్ధరించి ప్రజల ఆహ్లాదానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్థానికులతో పాటు పట్టణ వాసులు కోరుతున్నారు.

పూర్తి నిర్లక్ష్యానికి గురవుతోంది



పట్టణంలోని 8వ వార్డు పరిధిలో సుమారు 15 సంవత్సరాల కిందట ఏర్పడిన బీఆర్ నగర్ కాలనీ పూర్తి నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రభుత్వాలు మారుతు న్నా రోడ్లు, కాలువల నిర్మాణం లేదు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమరావతి పార్క్ ఏర్పాటు చేసినా ఆ తర్వాత అధికారులు నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం పార్కు ముళ్లపొదలతో నిండింది. దీనిని పునరుద్ధరించాలి.

-అల్లు ఎర్రయ్య, బీఆర్ నగర్

ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి



పట్టణ ప్రజలకు సాయంత్రం వేళ ఆహ్లాదం, విశ్రాంతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన పార్కుపై నిర్లక్ష్యం వహించారు. ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికా రులు చొరవ చూపి పార్కు పునరుద్ధరణతో పాటు కాలనీలో రోడ్లు, కాలువలను నిర్మించాలి.

-పైడి బాలకృష్ణ, బీఆర్ నగర్

వర్షాలకు కోరుకుపోయిన చెరువుగట్టు



కోరుకుపోయిన చెరువు గట్టు

సరుబుజ్జిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూలసవలాపురం గ్రామంలోని కామినాయుడు చెరువు గట్టు ఇటీవల కురుస్తున్న వర్షాలకు కోరుకు పోయింది. గట్టుకు ఇరువైపులా రంధ్రాలు ఏర్పడి మట్టి కొట్టుకు పోయింది. మూలసవలాపురం, సింధువాడ, మద్రిపాడు, తురకపేట, ఇసుకలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 200 ఎకరాలకు ఈ చెరువు ద్వారా సాగునీరు అందుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కుడి ప్రధాన కాలువల ద్వారా వచ్చే నీటితో చెరువు పూర్తిస్థాయిలో నిండి ఉంది. ఏ క్షణాన్నైనా చెరువుగట్టుకు గండిపడితే పంట పొలాలన్నీ ముంపునకు గుర య్యే అవకాశం ఉందని, తక్షణం తగు చర్యలు తీసుకుని చెరువు గట్టును పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులోని శ్రీ కాళీమాత షిర్డీసాయిబాబా ఆలయంలో సింహ సంక్రమణం సందర్భంగా ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాళ్ల సత్యం, కె. ఢిల్లీరావు, ధర్మా, గిరి, మదన్, రమేష్, సాయి, కింగ్, బాబ్జీ, కిశోర్ పాల్గొన్నారు. ● స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో సింహ సంక్రమణం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మెగా అభిమానుల రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీ ఫంక్షన్ హాల్లో శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకు సహకారంతో 126 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. చిరంజీవి స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. అలాగే జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, గురుగుబిల్లి లోకనాథం, బ్లడ్‌బ్యాంకు మేనేజర్ మణికంఠ, వైశ్యరాజు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బూరవెల్లి రూట్‌లో బస్సులను నడపాలి

గార, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నుంచి బూరవల్లి రూట్‌లో కళింగపట్నానికి ఆర్టీసీ బస్సులను నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రూట్‌లో నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు గార, కళింగపట్నం గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారని, బస్సులు లేకపోవ డంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ మార్గంలోని బూరవెల్లి, అంబళ్లవలస, పూసర్లపాడు, శాలిహుండాం, బోరవానిపేట, గార, ఆరంగిపేట, ఎస్‌డిఎస్‌పేట, హుకుంపేట, వమర వెల్లి తదితర గ్రామాల నుంచి విద్యార్థులు కళింగపట్నం జూనియర్ కళాశాలకు చదువుకునేందుకు వెళుతున్నారని, అయితే ఉదయం, సాయం సమయాల్లో బస్సులు లేకపోవడంతో ఇతర వాహ నాలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో అదనపు వ్యయం చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఈ రూట్‌లో గతంలో ఐదు బస్సులు నడిపేవారని, ఇప్పుడు కేవలం ఒకే బస్సు కొమర వానిపేటకు వస్తోందని, దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు రాయితీ సదుపాయం కల్పించినా వినియోగించుకోలేకపోతున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బూరవెల్లి రూట్‌లో ఆర్టీసీ సర్వీసులను వేయాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

సోంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోంపేటలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను రాజకీయ నెపంతో తొలగించడం సరైంది కాదన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కంచిలి మండల కార్యదర్శి కౌసల్య, మీనా, శ్యామల, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పాలవలస గేటు వద్ద ప్రమాదకరం



రైల్వే ట్రాక్ వద్ద ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

సోంపేట రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం పాలవలస రైల్వే గేటు వద్ద ట్రాక్ పై పలకలు విరిగిపోయి ప్రమాదకరంగా తయారైంది. సోంపేట, మందస మండలాల పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు సోంపేట, బారువ వివిధ పనుల నిమిత్తం ఈ గేటు మీదుగా రాకపోకలు సాగిస్తు న్నారు. ఫ్లైఓవర్ లేకపోవడం, పట్టాల వద్ద రాళ్లు తేలి ఉండడంతో వాహనాలు రాళ్ల మధ్య ఇరుక్కుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తాన్‌సాహెబ్‌పేటలో భూ సర్వే

గార రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తాన్‌సాహెబ్‌పేటలో భూ సర్వే చేపట్టాలని స్థానికుల వినతి మేరకు రెవెన్యూ సిబ్బంది ఆదివారం రోవర్‌తో సర్వే చేపట్టారు. తరతరాలుగా ఈ భూమిని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నామని, శాశ్వత హక్కు కల్పించాలని కోరుతూ తాన్‌సాహెబ్‌పేటకి చెందిన రైతులు ఇటీవల ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ప్రజాదర్బార్‌లో కోరారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్నా హక్కులు లేకపోవడంతో బ్యాంకుల్లో రుణాలివ్వడం లేదని, విపత్తుల సమయంలో ఎటువంటి సాయం అందడం లేదని 28 కుటుంబాలకు చెందిన రైతులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ చక్రవర్తికి సూచించారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాలతో సచివాలయం సర్వేయర్ కుసుమ, వీఆర్వో సింహాచలం రోవర్‌తో సర్వే చేశారు. నివేదికను అధికారులకు అందించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిలుగు అప్పల నాయుడు, మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి, సర్పంచ్ ప్రతినిధి తమ్మిన రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాకుంభాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్ ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఏకోత్తర సహస్ర కలశ స్నపన పూర్వక మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తులసీరావు తెలిపారు. ఈ మేరకు ఆది వారం ఉత్సవ కరపత్రాలను విడుదల చేశారు. 19న గోపూజ, విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహ వచనం, పతాక, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 20వ ప్రధాన మండపా రాధన, ఏకోత్తర సహస్ర కలశ స్నపనం, 21న కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ శిఖరంపై మహా కుంభాభిషేకం, విశేష అలంకరణ, అర్చన, అనంతరం శాంతి కల్యాణం, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆర్‌వీఎస్ శర్మ, బీవీఎస్ఎన్‌రెడ్డి, కె.రమేష్ కుమార్, ఆలయ అర్చకులు గోపినంబాళ వేంకట సీతారామాచార్యులు, నేతేటి మారుతీ ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆరోపణలు అవాస్తవం

● పాఠశాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినందుకే దుష్ప్రచారం
● ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ రవికుమార్



శ్రీకాకుళం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్త వాలే అని ఏపీ అసెంబ్లీ పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అమెరికా నుంచి ఒక ప్రకట న విడుదల చేశారు. ఆ ప్రకటన వివరాలిలా.. 'కేజీబీవీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినందుకే నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. విద్యార్థినుల అడ్మిషన్లకు అక్రమంగా డబ్బులు వసూలు చేసి.. నిత్యావసరాలను దారి మళ్లించడం తదితర అంశాలను ప్రశ్నించినందుకే వైసీపీ నేతలతో కలిసి ప్రిన్సిపాల్ నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 'తల్లికి వందనం' పై ముగ్గురుతో ఒకేసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాను. కేవలం పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్‌తోనే వీడియో కాల్ తీసుకున్నట్లు అబద్ధపు ఆరోపణలు. విద్యార్థినులతో ఇంట్లో పనులు చేయించుకోవడం, మెగా టీచర్-పేరెంట్ మీటింగ్ కోసం విద్యార్థినుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తోందని తల్లిదండ్రుల ఫిర్యాదుల ఆధారంగా మాత్రమే నేను ప్రశ్నించాను. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి గతంలో సస్పెండ్ అయిన చరిత్ర ఉన్న ఆ ప్రిన్సిపాల్‌ను అడ్డుపెట్టుకుని నాపై బురదజల్లేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారు. అమెరికా నుంచి తిరిగి రాగానే పూర్తి వివరాలతో మీడియా ముందుకు వస్తాను' అని పేర్కొన్నారు.

వరి నాట్లు ముమ్మరం



వరి నాట్లు వేస్తున్న దృశ్యం

సోంపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడంతో మండలంలో వరినాట్లు ముమ్మరం చేశారు. ఈ వర్షాలు పంటలకు ఎంతో మేలు చేకూరుస్తాయని ఏడీఏ భవానీశంకర్ తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సోంపేట మండలంలో సాగునీటి వనరులు తక్కువగా ఉన్నందున రైతులు ఎద ఆధారిత వరి సాగు కన్నా, నాట్లు వేసే పద్ధతిలోనే సాగుకు ఆసక్తి చూపుతు న్నారని చెప్పారు. మండలంలోని 9వేల ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటి వరకు 3194 ఎకరాల్లో సాగు చేస్తున్నారన్నారు. మరోవారం రోజుల్లో అధనంగా 2300 ఎకరాల్లో నాట్లు వేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. మండలానికి మొత్తం 275 టన్నుల ఎరువులు అవసరం కాగా 193 టన్నులు ఇప్పటికే సిద్ధం చేయడం జరిగిందన్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం



న్యాయాధికారి పరేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఇచ్ఛాపురం మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి పి.పరేష్‌కుమార్ అన్నారు. రోటరీ యువజన మాసోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక రోటరీ హాల్లో ఆదివారం నిర్వహించారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతాశయాలను ఏర్పరచుకోవాలన్నారు. పోలియో నిర్మూలను అందరూ సహకరించాలన్నారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం న్యాయాధికారి పరేష్‌కుమార్, డా. మోహన్ రౌళోలను సత్కరించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ ఎం.చిన్నంనాయిడు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహన్‌వెంకటేష్, కార్యదర్శి రామకోటి, సభ్యులు బాబీ, సారథి, రాజేష్, త్రినాథ్‌రెడ్డి, జోహార్‌ఖాన్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.4.83 లక్షలు

అరసవల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం రూ.4,83,021 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,10,500, విరాళాల ద్వారా రూ.1,08,351, ప్రసాదాలు రూ.1, 64,170 ఆదాయం లభించింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్వామిని భక్తులు సాధారణ సంఖ్యలో దర్శించుకున్నారు.

త్వరలో కొత్త టీచర్లు

(ఐదో పేజీ తరువాయి)

బీసీఈలో 107 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు తరువాత ఎస్సీ కేటగిరీ -1లో 516 మంది, ఎస్సీ కేటగిరీ-2 నుంచి 666 మంది, ఎస్సీ కేటగిరీ -3 నుంచి 3,066 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీ విభాగం నుంచి 2,377 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 408 మంది, దివ్యాంగుల విభాగంలో దృష్టిలోపం గలవారు 128 మంది, వినికిడి లోపం ఉన్న వారు 32 మంది, శారీరక వైకల్యం ఉన్న వారు 441 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఈ ఏడాది జూన్ 2 నుంచి జూలై 7 వరకు డీఎస్సీ పరీక్షలు రాశారు. ఆగస్టు 15 నాటికి పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం నాలుగు రోజులు ముందే విడుదల చేసింది. టెట్ మార్కులను కొందరు అభ్యర్థులు తప్పులతడకలుగా పొందుపరిచారు. టెట్ మార్కులను సవరణ చేసి తుదిజాబితాను విద్యాశాఖ డీఎస్సీ -2025 వెబ్‌సైట్‌లో ఉంచింది. దీనిపై అభ్యంతరాలకు ఆదివారంతో గడువు ముగిసింది. సోమవారం తుది మార్కుల జాబితాను విడుదల చేసి, మంగళవారం నుంచి మెరిట్ జాబితా, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తదితర అంశాలపై విద్యాశాఖ దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

తమ్ముడిని కాపాడి.. అనంతలోకాలకు

(ఐదో పేజీ తరువాయి)

సమీపంలోని నాగావళి నది తీరంలో నిత్యం ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడుతున్నాయి. ఇవి గమనించక నదిలో స్నానాలు, ఇతర అవసరాల కోసం దిగుతున్న వారు మృత్యువాత పడుతున్నారు. పవన్ మృతికి కూడా ఆ గుంతలే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఐగాట్ కర్మయోగి పాఠాలు బలవంతం సరికాదు

ఆమదాలవలస, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై ఐగాట్ కర్మయోగి యాప్ ద్వారా పాఠాలను బలవంతంగా రుద్దడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. మే నుంచి యాప్ లోని వీడియో పాఠాలు వీక్షించి అసైన్‌మెంట్‌లు పూర్తి చేసి సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేయాలని అధికారుల నుంచి ఒత్తిడి వస్తోందన్నారు. ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి, ఎందుకు వినాలనే విషయమై ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల ఇంటర్నెట్ ఖర్చుతో పాటు యాప్‌లతోనే రోజంతా గడపాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే సమయం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. స్వచ్ఛందంగా వినడం తప్ప బలవంతపు రీతిలో అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించ నున్న ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను 'మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే ఇప్పటికే నమోదైన అర్జీ స్థితిగతులను 1100 నెంబర్‌కు డయల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేంద్రియ విధానంతో మేలు

కంచిలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ విధానంతో రైతుకు మేలు జరుగుతుందని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. చిన్నకొజ్జిరియా పంచాయతీ చంద్రుపుట్టుగలో మీనామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. మీనామృతం వినియోగం వల్ల పైరుకు చీడపీడల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

నేటినుంచి ఆకాశవాణిలో లలితారెడ్డి ప్రసంగాలు

జి.సిగడాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో సోమవారం నుంచి 23వ తేదీ వరకు కస్తూర్బా గాంధీ విద్యాలయ పీజీటీ తెలుగు ఉపాధ్యాయిని లలితారెడ్డి ప్రసంగించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 6.35 వరకు చింతన కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై ప్రసంగించనున్నట్లు ఆమె తెలిపారు.

క్రీడాకారులు హాజరుకావాలి

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 20న విశాఖపట్నంలో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మంగళవారం కోడి రామ్మూర్తి స్టేడియంలో హాజరుకావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్చరీ నుంచి 13 మంది, అథ్లెటిక్స్ నుంచి పది మంది, బాస్కెట్ బాల్ నుంచి 12, కబడ్డీ నుంచి 12, వాలీబాల్ నుంచి పది మంది క్రీడాకారులను జిల్లా స్థాయిలో ఎంపిక చేశా మని, వీరంతా తప్పనిసరిగా మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు హాజరు కావాలని సూచించారు.

యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ కార్యవర్గ ఎన్నిక

పొందూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బాసా ఆనందమోహన్, అధ్యక్షుడిగా గుడ్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా మాసాడ భోగిరాజు, ప్రధానకార్యదర్శిగా మన్నాన వెంకటరావు, సహాయ కార్య దర్శిగా బలివాడ శివకుమార్, కోశాధికారిగా కోరుకొండ విజయకుమార్ ఎన్నికయ్యారు.

శిథిలావస్థలో..

కిల్లోయి పంచాయతీలో సుమారు 15 గిరిజన గ్రామాలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులు నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన జీసీసీ గోదాం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులూడి కూలిపోయే పరిస్థితిలో ఉంది. దీంతె పాఠశాల అదనపు భవనంలో నిత్యావసర సరుకులు నిల్వ ఉంచి పంపిణీ చేస్తున్నారు. సరుకులు ఉంచేందుకు ఇరుకు గదులు ఉపయోగిస్తుండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ అధికారులు స్పందించి ఈ గోదాంను మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - మందస



శిథిలావస్థకు చేరుకున్న కిల్లోయి జీసీసీ గోదాం

ప్రమాదకరంగా..



రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

మండలంలోని పలు రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన జంగిల్స్‌ను తొలగించాని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బడగాం, నవరలింగపురం, కర్లపూడి, బెల్లుకోల, భైరిబొడ్డపాడు, సొంటినూరు, హీరాపురం, నవర రామక్రిష్ణాపురం, పూండీ-చరణదాసుపురం తదితర గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. మలుపులతో కూడిన రహదారులు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. రాత్రివేళల్లో భయం భయంగా వెళ్లాల్సి వస్తుంది సంబంధిత అధికారులు స్పందించి జంగిల్స్‌ను క్లియర్ చేయాలని కోరుతున్నారు. - నందిగాం

నరకయాతనే..

వెంకటాపురం-బమ్మిడి రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సిందే. నివగాం ఎఫ్‌సీ గోదాంలో రైతులు తమ పంటలను నిల్వ చేయాలంటే ఈ రహదారిలోనే వెళ్లాల్సి వస్తుంది. ఈ రోడ్డు విపరీతమైన గోతులతోపాటు చిన్నపాటి వర్షానికి అధ్వానంగా తయారైంది. రైతులకు, ప్రజలకు రవాణా చేసేందుకు అంత్యంత ఉపయోగపడే రహదారిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. పాతపట్నం ఎమ్మెల్యే స్పందించి ఈ రహదారిని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. - కొత్తూరు



వెంకటాపురం-బమ్మిడి రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిలు

చెరువును తలపిస్తూ..



కాశీబుగ్గ మూడు రోడ్లు జంక్షన్ వద్ద నిలిచిన నీరు

పలాస-కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద రోడు చెరువులా తలపించింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కాలువలు రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. ఆదివారం ఉదయం నుంచి వర్షం కువడంతో మూడు రోడ్ల జంక్షన్ వద్ద భారీగా నీరు ప్రవహించింది. వాహనాల రాకపోకలు కొంత సమయం వరకు స్తంభించాయి. గత పది రోజులుగా ఎండ తీవ్రత ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా రైతులు పంట పొలాలకు నీరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా వర్షం ఏకధాటిగా కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. - కాశీబుగ్గ

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

పొందూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కనిమెట్ట గ్రామానికి చెందిన పేడాడ అప్పలనాయుడు (60) ఆదివారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మద్యానికి అలవాటు పడిన అప్పలనాయుడును కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకున్నాడు. హైదరాబాద్‌లో తాపీ పనిచేస్తున్న అప్పలనాయుడు ఇటీవల రైతు భరోసా నగదును తీసుకునేందుకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. భార్య అప్పలనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ప్రేమించాడు.. పెళ్లికి నిరాకరించాడు..

- పోలీసులను ఆశ్రయించిన ఓ యువతి

పలాస, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తనను ఓ వ్యక్తి ప్రేమించి మోసం చేశాడని పలాస పట్టణ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు చేసినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఓ జీడి పరిశ్రమలో గుమస్తాగా పనిచేస్తున్న పట్టణానికి చెందిన జె.రమేష్, అదే పరిశ్రమలో పనిచేస్తున్న యువతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత ఆరేళ్లగా విశాఖ, విజయనగరం, పర్లాకిమిడి తదితర ప్రాంతాల్లో తిప్పి, అన్నివిధాలుగా వాడుకున్నాడు. చివరకు పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి కాదు పొమ్మంటున్నాడు. ఇప్పుడు తనని కాదని వేరే యువతిని పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో అతడికి ఫోన్ చేయగా, నిన్ను పెళ్లిచేసుకోలేనని చెప్పి, ఆయన తల్లితో కూడా మాట్లాడించి అసభ్యకరమైన పదజాలంతో తిట్టించాడు. దీంతో తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

క్యాబ్, కారుని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- పల్టీలు కొట్టి దుకాణంలోకి వెళ్లిన వాహనం
- తప్పిన పెను ప్రమాదం

జి.సిగడాం, ఆగస్టు 17(ఆంధ్ర జ్యోతి): మెట్ట వలస కూడలి వద్ద ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ వెళ్లేందుకు ప్రయాణికులను ఎక్కించేందుకు ఆగి ఉన్న మ్యాక్స్ క్యాబ్‌ను రా జాం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొనడంతో పాటు చిలకపాలెం నుంచి ఎదురుగా వస్తున్న కారును కూడా ఢీకొట్టింది. దీంతో క్యాబ్ రెండు మూడు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పా న్‌షాపులోకి దూసుకుపోయింది. ఆ సమయం లో షాపులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వై.మధుసూదనరావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న క్యాబ్‌ను, అలాగే ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. క్యాబ్ డ్రైవర్ కడగల రామినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ బలగ వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో కడగల రామినాయుడుకు స్వల్ప గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం రాజాంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నేటి నుంచి యూరియా పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ప్రాథమిక సహకారం సంఘానికి వచ్చిన 440 యూరియా బస్తాలను సోమవారం నుంచి పంపిణీ చేయిస్తున్నట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు ఇసా అప్పారావు ఆదివారం తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన 'ఆ యూరియా.. ఏమైంది' అనే కథనంపై స్పందించారు. సొసైటీకు యూరియా తక్కువగా రావడం వలనే పంపిణీ చేయలేదని.. రైతులకు ముందస్తుగా కూపన్ల పంపిణీ చేసి యూరియా పంపిణీ చేస్తామని సొసైటీ అధ్యక్షుడు అప్పారావు తెలిపారు. ఈ వ్యవహారంపై ఇంటలిజెన్స్ అధికారులు యూరియా పంపిణీ చేయకపోవడం పైగల కారణాలు.. స్టాక్ ఎక్కడ నిల్వ చేసారు తదితర వివరాలపై ఆరా తీసారు.

జిల్లాకు భారీ వర్ష సూచన

(ఐదో పేజీ తరువాయి)

అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఎటువంటి ఔట్ స్టేషన్ సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. మండల, డివిజనల్ స్థాయి కంట్రోల్ రూమ్‌లు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. 'సాగునీటి చెరువుల నీటి మట్టాలను పర్యవేక్షించాలి. నదులు, కాలువల గట్లను బలోపేతం చేయాలి. నిత్యావసర వస్తువులను నిల్వ ఉంచి, పునరావాస కేంద్రాలను శుభ్రపరిచి రెవెన్యూ శాఖకు అప్పగించాలి. రహదారులపై పడిన చెట్లను తొలగించేందుకు ఆర్అండ్‌బీ సిద్ధంగా ఉండాలి. తక్కువ ఎత్తులో ఉన్న రహదారులు, వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించే కాజ్‌వేలు మూసివేయాలి. వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలి, గర్భిణుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, వారికి హెచ్చరికలు జారీ చేయాలి. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం 08942 240557 నంబర్‌కు ఫోన్‌చేయాలని వెల్లడించారు.

ముంచెత్తిన వాన

(ఐదో పేజీ తరువాయి)

మేర నీరు నిలచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి..

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురస్తున్న నేపథ్యంలో అధికారులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. కాలువలు, చెరువులకు గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

నాన్‌స్టాప్ నిల్.. పల్లెవెలుగు ఫుల్!

- స్త్రీశక్తి పథకం ఎఫెక్ట్



పల్లెవెలుగు బస్సు ఎక్కడానికి తోసుకుంటున్న ప్రయాణికులు



వెలవెలబోతున్న నాన్‌స్టాప్ బస్సు

టెక్కలి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలో భాగంగా ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిం చడంతో ఆర్టీసీ బస్సులు అన్ని మహిళలతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం నాన్‌స్టాప్ బస్సులు మాత్రం ప్రయాణికులు లేక వెలవెల బోతే.. పల్లె వెలుగు బస్సులు మాత్రం మహిళలతో కిటకిటలాడుతున్నాయి. రోజూ పలాస నుంచి శ్రీకాకుళం వెళ్లే బస్సులు ఐదు సింగిల్ తిరుగగా సుమారు ఐదు వేల మంది వరకు మహిళా ప్రయాణికులు ప్రయాణించినట్లు ఆర్టీసీ సిబ్బంది తెలుపుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మహిళలు సంతోషం వ్యక్త చేయడం కనిపిస్తుంది.

వారి కృషితోనే కొత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధి



రాజగోపురానికి పూజలు చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లిని అన్ని విధాల అభివృద్ధి చేసింది దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు, ఆయన సోదరుడు మంత్రి అచ్చెన్నాయుడు, కుమారుడు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. ఆదివారం కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు అంతస్తుల రాజగోపురం, రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన అనివెట్టి మండలాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయ పురోహితులు సుసరాపు గణపతిశర్మ మంత్రోచ్చరణల నడుమ ఆలయ కార్య నిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, టిడిపి నాయకులు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, నంబాల శ్రీనివాస్, పూజారి శైలజ, కర్రి అప్పారావు, కల్లి లక్ష్మణరెడ్డి, నాగయ్యరెడ్డి, సాసుమంతు అనంద్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణుడికి ఊయల సేవ



పెంటూరు ఆలయంలో స్వామివారి ఊయల సేవ

నందిగాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పెంటూరులో కొలువైన వేంకటేశ్వర ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం రాత్రి స్వామివారికి ఊయలసేవ నిర్వహించారు. బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు, నారాయణరావు ఆధ్వర్యంలో అర్చకులు వరాహలక్ష్మి నర్సింహులు, రాజగోపాలచార్యుల పర్యవేక్షణలో ఊయల సేవ చేపట్టారు. కోలాటం, భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

జలుమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా పశువుల్లో వచ్చే వ్యాధులు నివారణకు గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని సురవరం గ్రామీణ పశువైద్యాధికారి ఎంవీ ఫ్రెడరిక్ తెలిపారు. తిమడాం గ్రామంలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. తిమడాం పశువైద్యశిబిరంలో 200 పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అల్లాడ సొసైటీ చైర్మన్ వెలమల చంద్రభూషణరావు, పశు వైద్య సిబ్బంది కె.చంద్రశేఖరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వెలమ కులస్థులను బీసీ-ఏలో చేర్చాలి



మాట్లాడుతున్న వెలమ సంక్షేమ సంఘ నాయకులు

నరసన్నపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సామాజకంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వెలమ కలాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చాలని వెలమ సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జమ్ము జంక్షన్ వద్ద గల ఒక కల్యాణ మండపంలో జిల్లా వెలమ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. గతంలో బీసీ-డీలో సామాజికంగా చైతన్యం, తెలివైన కులాలను చేర్చడంతో వెలమ కులస్థులు ఉద్యోగాలు, ఉన్నత చదువులు కోసం రిజర్వేషన్‌లో సీట్లు కోల్పయిన పరిస్థితితో వెలమ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెలమ కులంకు బీసీ-ఏ జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘ నాయకులు దుంగ సుధాకర్, దండుగుల పార్థసారథి, డాక్టర్ పొన్నాడ గణేష్, పోగోటి రాజారావు, డాక్టర్ సూరపు కృష్ణారావు, గొండు స్వామి, గొద్దు చిట్టిబాబు, ఇప్పిలి వేణుగోపాలరావు, రఘు, శిమ్మ జగన్నాథం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వంశధార నదీ తీర గ్రామాల్లో అప్రమత్తం



సురవరం వద్ద వంశధార నదిని పరిశీలిస్తున్న దృశ్యం

జలుమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఒరిశాతోపాటు వంశధార నదీ పరివాహ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదిలోని నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.రామారావు అన్నారు. కొమనాపల్లి, సురవరం వద్ద నదిలో ప్రవహించే నీటి ప్రవాహాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నదీతీర గ్రామాల్లో ఆయా వీఆర్వోల నేతృత్వంలో దండోరా వేయిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలు వలన గొట్టాబ్యారేజీకి 7,200 క్యూసెక్కుల నీరు చేరిందన్నారు. ఇందులో 5 వేలు క్యూసెక్కుల నీటిని వంశధార నదికి, ప్రధాన ఎడమ కాలువకు 1,771 క్యూసెక్కులు, కుడి కాలువకు 417 క్యూసెక్కుల నీటిని విడచిపెట్టినట్టు తెలిపారు. వంశధారనదికి నీటి ప్రవాహం పెరిగే అవకాశమున్నందున నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటిప్రవాహం స్థాయి తెలుసుకునేందుకు గ్రామాల్లో ఎటువంటి విపత్తులు జరుగకుండా ఉండేందుకు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్‌ఐ కిరణ్, పలువురు వీఆర్వోలు ఉన్నారు.

జోరువాన



నరసన్నపేట: జమ్ము జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డుపై వర్షపునీరు



టెక్కలి రూరల్: కురుస్తున్న వర్షం



నందిగాంలో కురుస్తున్న వర్షం


జిల్లా వ్యాప్తంగా ఆదివారం జోరుగా వర్షం కురిసింది. దీంతో గతకొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బందిపడిన జిల్లా ప్రలకు ఈ వర్షంతో ఉపశమనం కలిగింది. ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

నీరు ఒడిశాది.. నష్టం ఏపీది

(ఐదో పేజీ తరువాయి)

ఒడిశా అధికారులను కోరారు. వారు నిరాకరించడంతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, జిల్లా కలెక్టర్ స్పందించి అక్కడి అధికారులతో మాట్లాడి నీరు విడిచిపెట్టేలా చేశారు.

ఒడిశా పెత్తనం..



బాహుదా నదిపై ఒడిశా పెత్తనం సాగుతోంది. నది జలాలను పూర్తిగా ఆ రాష్ట్రమే వాడుకుంటోంది. అసలు ఏపీకి సంబంధమే లేదన్నట్టు వ్యవహరిస్తోంది. వైసీపీ హయాంలో నిర్లక్ష్యం కొనసాగింది. ఒక్క వర్షాకాలంలో మాత్రమే నదిలో నీరు కనిపిస్తుంది తప్ప.. మిగతా రోజుల్లో ఒడిశా దయాదక్షణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించాలి.

- జన్నెల ప్రసాదరావు, రైతు కులం, రైతుమిత్ర సంఘం నియోజకవర్గ కన్వీనర్



వర్షాకాలం నది..

వర్షాకాలం నదిలా మారింది బాహుదా. నదిని చూస్తే బాధేస్తోంది. పక్కనే నది ఉన్నా పొలాలకు సాగునీరు అందని దుస్థితి. ఒడిశా ప్రాజెక్టుల మీద ప్రాజెక్టులు కడుతోంది. కానీ మన భూభాగంలో ఉన్న చిన్నపాటి కాలువలకు సైతం మరమ్మతులు చేయలేకపోతున్నాం. ఈ నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఆధారపడే బాహుదా నదిపై పాలకులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

-ఆశి చిరంజీవులు రెడ్డి, రైతు, ఇచ్ఛాపురం

మోసగించిన వ్యక్తిపై కేసు

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేసి నట్టు రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విద్యార్థిని తాతగారి వద్ద నరసన్నపేటలో ఉంటూ ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆ సమయంలో ముసిడిగట్టుకు చెందిన నబ్బి సింహాద్రితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి ఆ తర్వాత కొన్నాళ్లకు పెళ్లికి నిరాకరించాడు. మోసపోయానని భావించిన ఆమె రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సింహాద్రి అసోం రైఫిల్స్‌లో పనిచేస్తున్నాడు.

డీజిల్ ట్యాంకర్ బోల్తా

టెక్కలి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి-మెళియాపుట్టి రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో ఆదివారం వేకువ జామున డీజిల్ ట్యాంకర్ బోల్తాపడింది. విశాఖ నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. పెద్ద ప్రమాదం తప్పగా, డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. 108 అంబులెన్స్‌లో అతన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మండల సమావేశం

పాతపట్నం ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.చంద్రకుమారి తెలిపారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు సంసిద్ధులై హాజరుకావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నందిగాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతాప విశ్వనాథపురంలో అంజనేయ ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ జరిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు టి.సుధాకర్ శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో బమ్మిడి నరేంద్ర మాష్టారు, కె.జయరాం, వై.సోమేశ్వరరావు, టి.నగేష్, కె.మాధవరావు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

హిరమండలం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనచోదుకుడు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ అన్నారు. ఆదివారం హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు.ఈయనతో పాటు ఎస్‌ఐ ఎండీ యాసిన్ ఉన్నారు.

సింహ సంక్రమణ పూజలు

పలాసరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామాలయ కాంప్లెక్స్‌లో వెలసిన జగన్నాథ ఆలయంలో జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సింహ సంక్రమణను పురస్కరించుకొని హోమం, పూజలు చేపట్టారు. విశ్వశాంతిని కోరుతూ ప్రతీ నెలా సంక్రమణం పూజలు నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. హోమం, పూజలు జరిపిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ కార్యదర్శి బాబూరావు పండా, కామేశ్వరరావు పండా, రవిబ్రహ్మ, అర్చకులు బాలకృష్ణ, దాస్ పాల్గొన్నారు.

12 మద్యం సీసాలు పట్టివేత

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కళ్లేపల్లి పంచాయతీ మొపసుబందరుకు చెందిన లాడి కామేశ్వరావు పాన్‌షాపు నిర్వహిస్తూ మద్యాన్ని అక్రమంగా ఉంచినట్లు వచ్చిన సమాచారంతో ఆదివారం ట్రైనీ ఎస్‌ఐ, సిబ్బంది దాడి చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు. 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1449 ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేశామన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జలుమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన శక్తి టీం సమావేశంలో ఆయన పాల్గొని బాలికలకు చట్టాలపై అవగాహన పరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు సంరక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేసిందన్నారు. అలాగే ఫోక్సో చట్టంపై అవగాహన పరిచారు. మత్తు పదార్థాలు వాడడం వలన కలిగే అనర్థాలను వివరించారు. మేట్రిన్ మాధవి, పీసీలు వై.నారాయణ, జనార్దన, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.